# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-2, సంచిక-6 15 డిసెంబర్ - 2015 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## దేశంలో లోకవిద్యతో పనిచేసే ప్రతీ పౌరుడికీ ప్రభుత్వోద్యోగులతో సమంగా వేతనాలు కల్పించే వరకూ రిజర్వేషన్ ఉద్యమాలు ఆగవు

మన కందరికీ అందుబాటులో ఉన్న చరిత్రను పరిశీలిస్తే వైదికయుగంలో (క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం వరకూ) సాధారణంగా అన్ని కులాల వారికీ జ్ఞాన సంబంధ విషయాలు, వేదాల చదువు అందుబాటులో ఉండేవి. అందరికీ చదువుకునే అవకాశాలు ఉండేవి. దాని తర్వాత సుమారు క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం నుంచి క్రీస్తుశకం 6వ శతాబ్దాల మధ్య 900 వందల సంవత్సరాలలో బ్రాహ్మణులు మాత్రమే చదువుకు, వేదపఠనానికి అర్హులనే ప్రచారం ఊపందుకుంది. కానీ అదే సమయంలో బౌద్ధ, జైన మతాలు పుట్టి ఈ ప్రచారం తప్పనీ, కులాల్లో ఉన్నతి తరగతి క్రింది తరగతులు అనేవి తప్పనే ప్రచారం ప్రారంభమైంది. తర్వాత సంస్కరణ ఉద్యమాలన్నీ కులాల్లో హెచ్చుతగ్గులన్నీ తప్పని చెప్పేవే. తాత్వికంగా అందరూ సమానమేనని చెప్పినా ఆచరణలో అమలు పూర్తి కాలేదు. తర్వాత చరిత్ర పరిశీలిస్తే నాటినుంచి నేటివరకూ జరిగే అన్ని ఉద్యమాల మూలాలు కులాలకన్నిటికీ సమానత్వం కల్పించాలనే. ఈ ఉద్యమాలు మిట్టపల్లాలు చూస్తూ “భక్తి ఉద్యమాలు” పుట్టాయి. భక్తి ఉద్యమంలో మూలాధారం దళితులనీ, అంటరాని వాడనే భావన మానవులు సృష్టించారు, కాని భగవంతుని దృష్టిలో అందరూ సమానులమేనని మన సమాజంలో నేటిదాకా చేసే పనిని బట్టి కులాలు, ఉపకులాలు నిర్ధారింపబడినా, ఈ కులాలకున్న జ్ఞానాన్ని ప్రస్తావిస్తూ వృత్తులన్నీ చేయటానికి పనికి వచ్చే జ్ఞానం సమానమేనన్న ప్రాథమిక అంశాన్ని విస్మరించారు.

నాటి సమాజంలో ప్రకృతి సిద్ధమైన వనరుల నుండి పండించే వారు కొందరుండగా, సేవారంగం (పనిలో, రవాణాలో, ప్యాకింగులో, వేరు చేయడంలో, జల్లించటంలో, దంచటంలో మొదలైనవే కాకుండా కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, బుట్టలల్లటం, చెప్పులు కుట్టడం, మంగలి, నేత, చేపలు పట్టడం మొ॥లైన రంగాలన్నీ సేవారంగాలుగా గుర్తించటం జరిగింది.) లో సమాజంలో అందరూ పనిచేస్తూ కలిసి జీవించేవారు. ఈ రంగాల్లో పనిచేసే వారంతా అందరి భౌతిక అవసరాలు తీర్చేవారు. వీరితోపాటు ప్రకృతిలో జరిగే మార్పులు - సాధారణంగా మానవులకు నష్టం కల్గించే ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, కరువులు, అంటువ్యాధులు ప్రబలటం, పంటలపై చీడపీడల దాడులు ఎందుకు జరుగుతున్నాయో సామాన్యుల కర్థం కాలేదు. ఈ ప్రకృతి వైపరీత్యాలని ముందుగా తెల్సుకోవటం, దాన్ని ఏవిధంగా అధిగమించాలో తెలియటం వీలైతేదాని నివారణకు ఏం చర్యలు తీసుకోవాలో తెల్సుకోవటం సామాన్యునికి అర్థంగాని ప్రత్యేక విద్యే. వీటికోసమే ఖగోళశాస్త్రం (జ్యోతిష్యాస్త్రం), వైద్యం, వాతావరణ పరిశోధన రంగాలు ఉద్భవించి ఉంటాయి. అప్పటికే వివిధ వ్యాపకాలతో వృత్తులతో ఉన్న వాళ్ళే ప్రకృతి వైపరీత్యాలపై పరిశోధనా వ్యాసంగానికి కూడా తమతమ సమయాన్ని వెచ్చించి ప్రత్యేక జ్ఞానం సంపాదించి ప్రత్యేక గౌరవం పొంది ఉంటారు. అప్పటికే చదువు చెప్పే మరియు వేదాధ్యయనం చేసే బ్రాహ్మణ వర్గం వారే తమకు దొరికిన విరామ సమయాన్ని ఈ ప్రత్యేక జ్ఞాన సంపాదనకే పూర్తిగా వినియోగించి ఉంటారు. నేడు అత్యంత మేధావులుగా గౌరవం పొందే వైద్యులు, శాస్త్రజ్ఞులువలే నాడు ప్రకృతి గురించి ముందుగా తెల్పుకలిగిన విద్య గల, దాని నుంచి రక్షించుకునే మార్గం తెల్పకల్గినవారికి అత్యంత గౌరవం పొందటం మామూలే. అటుపాశ్చాత్య ప్రపంచంలో కూడా ఖగోళశాస్త్రజ్ఞులైన టాలమీ, కొపర్నికస్, కెప్లర్‌లకు కూడా అత్యంత గౌరవం ఇందువల్లే పొందటం చూసాం. వీరంతా తమ మత గ్రంథాలను చదివి నిష్ణాతులవటం మనకు ప్రపంచవ్యాప్తంగా ఈ మత పెద్దలకు పెద్దపీటవేయటానికి కారణంగా కనపడుతుంది.

ప్రధానంగా వ్యవసాయరంగం, సేవారంగంలో వున్న సామాన్య మానవులు ప్రకృతి విపత్తుల నుండి రక్షించ కలిగే వర్గంగా బ్రాహ్మణ జ్ఞానాన్ని గుర్తించటంతో పాటే తాము చేసే పని సులువుగా కన్పించటంతో తమ జ్ఞానాన్ని తక్కువగా తామే చూడటం ప్రారంభించారు. వారి వారి జ్ఞానంతో తము చేసే పనుల్లోనే అనేక కొత్త విషయాలు (వ్యవసాయ పద్ధతులు, నూతన వంగడాలు, అంటుకట్టడాలు, పంటమార్పు విధానం, చేపల వలతో ఉండే పడగు పేకల మధ్య ఖాళీ, ఇరుసు, కత్తి, సుత్తి లాంటి అనేక పనిముట్లు సామాన్యులే కనుగొన్నారు.) కనుక్కోవడానికి కులాధిపత్యాలు అడ్డంకి కాలేదు. కులాల మధ్య తారతమ్యాల వల్ల వారి వారి వృత్తులకు, జీవనానికి ఎటువంటి ఆటంకం లేకపోవటంతో సమాజంలో ఉద్రిక్తతలున్న దాఖలాలు లేవు. దానితో కాలక్రమంలో కులాలు గుర్తింపు సాఫీగానే జరిగిపోయింది. కాలానుగుణంగా చేసే పనులను బట్టే కులం గుర్తింపు లభించేది. వేద ప్రమాణిక ప్రపంచదృష్టిని ఆరో శతాబ్దం నుంచే ప్రశ్నించే ఇస్లాం, క్రైస్తవ మతాలతోపాటు అనేక ఇతర విశ్వాసాలూ పుట్టాయి. ప్రత్యామ్నాయ ప్రాపంచిక దృక్పథంలో కులాల ప్రసక్తి లేదు. అందుకే అనేక క్రింది కులాలవారు, బహిష్కృతులు, అంటరానివారు ఈ మతాల్లోకి మారిపోయారు. కానీ 18వ శతాబ్దం వరకూ సామాన్య ప్రజల్లోని ఉన్నత వర్గాల్లోని లోకవిద్య మరియు లోకవిద్య ఆధారిత ఆచారవ్యవహారాలు, ఉత్పత్తి, వ్యాపారాలు, జీవన విధానాల్లో పెద్దగా మార్పులు జరిగిన దాఖలాలు లేవు. ఆ రోజుల్లో జరిగిన ఉద్యమాలు కులాల పోరాటాలుగా జీవన విధానాన్ని పెనుమార్పులకు గురిచేసేదిగా జరిగినట్లుగా చరిత్రలో కన్పడదు.

18వ శతాబ్దపు ప్రారంభంనుంచి, బ్రిటీష్ ప్రభుత్వ పరిపాలన, చదువులు, వ్యాపారం, వాణిజ్యం, రాకపోకలు, రవాణా మరియు సత్వర సంప్రదింపుల కోసం తపాలా, టెలిగ్రాఫ్, టెలిఫోన్ సాధనాల ప్రవేశంతో మన మధ్య సంబంధ బాంధవ్యాలలో పెనుమార్పులు ప్రవేశించాయి. నిబద్ధతతో కూడిన వేతనాలు, ప్రభుత్వోద్యోగాలు అత్యంత ఆకర్షణీయంగా తయారయ్యాయి. బ్రిటీష్ ప్రభుత్వ అవసరాల మేరకు వారి ప్రభుత్వ, వ్యాపార వ్యవహారాల్లో పనిచేయటానికి పనికివచ్చే చదువు, దానికి సంబంధించిన పాఠశాల, కళాశాల విశ్వవిద్యాలయాల్లో ఇచ్చే డిగ్రీలు, డిప్లమాలు, సర్టిఫికెట్లు మాత్రమే చలామణీ అవటం మొదలైంది. పూర్తి సమయాన్ని వేదపఠనం, వాఙ్మయం, జ్యోతిష్యం, లెక్కలకు మాత్రమే కేటాయించే బ్రాహ్మణవర్గంతో పాటు అదనపు ఆదాయవర్గాలవారు, మొత్తంగా ఉన్నత కులాల వారు ఈ అవకాశాన్ని ముందుగా అందిపుచ్చుకున్నారు. వారే ఆంగ్ల మాధ్యమంలో పరిపాలన, న్యాయవిచారణ, శాస్త్రరంగాల్లో చదువుకోవటం తద్వారా నూతనకావకాశాల్ని చేజిక్కించుకున్నారు. తమ జీవనం సాఫీగా జరిగే వేతనాలు, జీతాలు పింఛన్లు కోసం ఒడిదుడుకులు లేని శాశ్వత ఉపాధికోసం వీరు బ్రిటీష్ చదువులు ఉద్యోగాలు జీవన విధానంగా స్వీకరించారు.

ఈ నూతన విద్యావిధానం కోసం పాఠశాలలు, కళాశాలలు విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం దొరకని ఇతర వ్యాపకాల్లోని సామాన్య ప్రజలంతా ఆఖరికి ఇంగ్లీషు చదవని అన్ని ఉన్నత వర్గాల వారితో సహా అంతా తమ జ్ఞానమంతా తక్కువని సర్టిఫికట్ల జ్ఞానమే గొప్పదని భావించటం జరిగిపోయింది. ప్రభుత్వాధినేతలైన వలస బ్రిటీష్‌వారు సామ్రాజ్య వాదానికి పనికివచ్చే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విలువలను పోషించే విద్యావిధానాన్ని తమ ప్రభుత్వ పరిపాలన, వాణిజ్య వ్యాపార వ్యవహారాలు, పరిశ్రమలకు పనికివచ్చే విద్యను మాత్రమే పోషించారు. తద్వారా లోకవిద్యలో లోకవిద్యతో జీవించే మిగతా వర్గాలన్నీ తమకు విలువలు లేకుండా పోయిందనే ఆత్మన్యూనతా భావంలో కూరుకుపోయారు. ఆవిధంగా లోకవిద్యకు గుర్తింపు పోయింది.

మరికొంత కాలానికి చదువుకున్న ఉన్నత కులాలవారికన్నా తాము వెనకబడ్డామని చదువుకున్న కులాలవారు మాత్రమే ఉన్నత కులాలవారనీ ముఖ్యంగా బ్రాహ్మణవర్గం ముందుందనే ప్రచారం ఊపందుకుంది. లోకవిద్యా సమాజంలో బ్రతకటానికి సరిపడే సంపాదన లేని వృత్తి విద్యా కులాల వారంతా తమకు ప్రభుత్వోద్యోగాలలో రిజర్వేషన్ సదుపాయం కావాలనే కోర్కెను ముందుకు తేవటం 19వ శతాబ్దపు అంత్యభాగంలో ఊపందుకుంది. సామ్రాజ్యవాద శక్తులు ఈ కోర్కె తీర్చటంలో రెండు లాభాల్ని గుర్తించాయి. మొదటగా భారతదేశంలోని హిందూ సమాజాన్ని విభజించి పాలించటానికి ఈ విభజన సులువైన మార్గంగా గుర్తించటం. రెండవది నూతన విద్యా విధాన ఆధిపత్యాన్ని మొత్తం లోకవిద్యా సమాజం ఐక్యంగా ఎదిరించకుండా నిరోధించకల్గడం. ఈ రిజర్వేషన్లు ప్రవేశంతో లోకవిద్య పనికిరానిదని, కులాల ఐక్యత సహజీవనం ఇక ఎంత మాత్రం సాధ్యంకాదనే భావాలు సామాన్య జనంలో నాటుకుపోయాయి. ఇది కులప్రాతిపదికన ఏర్పడిన కొత్త రాజకీయ పార్టీల అంకురార్పణకు దారితీసింది.

స్వాతంత్ర్య సంగ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన స్త్రీ పురుషులు బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరిస్తూనే మిగతా కులాల్నీ, మతాల్నీ కూడా కలుపుకుపోయే ప్రయత్నం చేశారు. లోకవిద్యా జీవన విధానం శాస్త్రబద్ధమైంది కాదనే ప్రచారం బ్రిటీష్ పాలనలో విజృంభించింది. దీనికి తోడు హిందూ సమాజాన్ని కులాలవారీగా రిజర్వేషన్లతో విభజించిన బ్రిటీష్ వారు, సమాజాన్ని మరింతగా విభజించటానికి మతకల్లోలాలు ప్రవేశపెట్టి దేశ విభజన చేయటంలో కృతకృత్యులయ్యారు. మొదటగా బెంగాల్ రాష్ట్రం మత ప్రాతిపదికన రెండుగా చెయ్యటంతో ప్రారంభమైన విభజన పాకిస్థాన్ దేశం సృష్టించటంతో పూర్తయ్యింది. కులాల కుమ్ములాటలు ఆఖరికి దళితులకు, గిరిజనులకు ప్రత్యేక నియోజక వర్గాలు ప్రత్యేక రాయితీలు ప్రవేశపెట్టడానికి దారి తీసాయి. దోపిడీని పూర్తిగా అంతంచేసి, అంతా సమానంగా బ్రతికే నూతన సమసమాజానికి దరిద్ర్యానికీ దూరంగా బదులుగా రిజర్వేషన్ కావాలనీ రద్దు కావాలనే నూతన నినాదంతో ఉద్యమాలు రోజూ పుడుతున్నాయి. ఈ రిజర్వేషన్లు ప్రతీ సమావేశంలోనూ - విద్యార్థుల, రైతుల, ఉద్యోగుల, కార్మికుల చివరగా నూతన వ్యవసాయ విధానంలో ప్రధానంశంగా మారిపోయాయి. కాల్వ క్రింద వ్యవసాయదారులు, మెట్టప్రాంత వ్యవసాయదారుల కన్న అభివృద్ధి చెందినవారుగా గుర్తింపు పొందటం కొత్తగా సాగు నీటిరంగంలో పెద్ద ప్రాజెక్టులకు నిరాశ్రయుల్ని చెయ్యటానికి ఉపయోగపడింది. మెట్టప్రాంత బహుళ పంట విధానం సంపూర్ణ పోషకాహారాన్ని అందించటంతో పాటు పర్యావరణ రక్షిత వ్యవసాయం వెనకబాటు గానూ, కాల్వక్రింద హైబ్రిడ్ మరియు జన్యుమార్పిడి విత్తనాల ఏకపంట విధానం భయాంకర వ్యాధులు వ్యాప్తిస్తున్నా అభివృద్ధి చెందిందిగానూ ఈనాడు చెలామణీ ఔతున్నాయి.

కొంతమంది జ్ఞానం మాత్రం గొప్పదనే భావననుండి విముక్తి చెందటమెట్లా?

ఈ సామాజిక తారతమ్యాలు తగ్గడానికి లోకవిద్యా సమాజంలోని అన్ని సమూహాలకూ, రిజర్వేషన్లు ఇవ్వటం ద్వారా అధిగమించాలనుకుంటున్నారు. దానికంటే కూడా లోకవిద్యా సమాజంలోని జ్ఞానాన్ని నూతనంగా సంపాదించిన సర్టిఫికట్టు చదువులతో చేసే పనులన్నింటితో సమానంగా చూసే దృక్పథం రావాలి. పారంపర్య జ్ఞానం నూతన జ్ఞానాల మధ్య ఉన్న హెచ్చుతగ్గుల్ని రూపుమాపాలి.

ఇది సాధ్యమా? లోకవిద్యా జ్ఞానాకి పునర్వైభవం తీసుకురావటం ద్వారా మాత్రమే సాధ్యం. స్థానిక వ్యాపార కూడళ్ళు లోకవిద్యా సమాజంలోని ఆర్థిక సామాజిక కోణాల్ని సృజిస్తూ వస్తు మరియు సేవలమార్పిడికి ఉపయోగపడుతాయి. వస్తువు లేదా సేవల ధరలు ఆనాటి మార్కెట్ అవసరాల మేరకు నిర్ణయమౌతాయి. కాని వస్తువు లేదా సేవల్లోని శ్రమ విలువ ప్రకారం కాని దాని ఉత్పత్తిలో ఉపయోగించిన జ్ఞాన ఆధారంగా కాని సాధారణంగా జరగవు. ప్రతీ వస్తువూ లేదా సేవల్లో ఉపయోగించిన జ్ఞాన ఆధారితంగా ధర నిర్ణయం జరిగి మార్కెట్ శక్తుల కబంధ హస్తాల నుండి విముక్తి కలిగితే న్యాయ సమ్మతమైన ధర చెల్లింపు జరగటం మొదలౌతుంది. దానితో కులమత ప్రస్తావన లేని జ్ఞాన, నైపుణ్యతల ఆధారంగా నిర్మితమయ్యే కొత్త మార్కెట్ నిర్మాణం మొదలౌతుంది. అందుకే లోకవిద్యా జనాందోళన ప్రతీ వృత్తిలోనూ ఉన్న జ్ఞానం ఇతర వృత్తులలో ఉపయోగించే జ్ఞానానికి ఏ మాత్రం తక్కువకాదనీ, ఉత్పత్తి, సేవారంగాలలో పనిచేసే ప్రజలందరికి ప్రభుత్వోద్యోగులతో సమాన వేతనాన్ని ఖచ్చితంగా చెల్లించి అసమానతల్ని రూపుమాపటానికి గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య, వివిధ కులాల, మతాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలను తుడిచిపెట్టడానికి దోహదపడుతుందనే ఉద్యమ నిర్మాణం ప్రారంభించింది.

దీని ద్వారా పర్యావరణ రక్షణ, కులమత ప్రాతిపదికన ఏర్పడిన హెచ్చుతగ్గుల నిర్మూలనతోపాటు, మేం వెనుకబడిన వారం కనుక మాకూ రిజరేషను ఇవ్వాలనే డిమాండ్లు కనుమరుగవుతాయి.

- డా॥ బి. కృష్ణరాజులు

# విచ్చలవిడి అవినీతే నేటి ఆత్మహత్యలకు పునాది - అందరికీ ప్రభుత్వోద్యోగులతో సమాన వేతనమే దీని పరిష్కారం

నేడు భారత్ జనాభా 130 కోట్లు. వీరిలో 18 ఏళ్ళ లోపు చదువుకోవల్సినవారు 52 కోట్లు, విశ్రాంతి తీసుకోవల్సిన 65 సంవత్సరపైబడినవారు 8 కోట్లు అంటే ఉద్యోగార్హత ఉన్నవాళ్ళు 70 కోట్లమంది. వీరిలో ప్రభుత్వోద్యోగులు - కేంద్రంలో సుమారు 40 లక్షలు, రాష్ట్రాలన్నింటికీ కల్సి మరో 80 లక్షలు. ఖచ్చితమైన నెలసరి వేతనాలు పొందే ప్రైవేటు ఉద్యోగులు మరో రెండు కోట్లు. అంటే 3 కోట్ల 20 లక్షల మంది నెలకు సుమారు 30 వేలపైనే వేతనం పొందుతున్నారు. ఇక కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వరంగ, బ్యాంకురంగ పెన్షన్ దారులు 2 కోట్లమంది ఉన్నారు. జనాభాలో ఖచ్చితమైన నెలసరి ఆదాయం పొందేవారు ఐదున్నర కోట్లలోపు. వీరి జీవనం అత్యంత ఆనందంగా సౌకర్యంగా జరిగిపోతోంది. వీరంతా ఒకటవ తరగతి పౌరులుగా జీవిస్తున్నారు. ఇక మిగిలిన 72 కోట్ల ఉద్యోగార్హతగల జనాభా ఏంచేస్తున్నారు?

వ్యవసాయం, చేనేత, కమ్మరి, కుమ్మరి, కల్లుగీత, పశువుల పెంపకం, చేపలు పట్టడం, చర్మకారులు, బంగారం, వెండి పని చేసేవారు, చిన్న వ్యాపారస్తులు, అడవిలో సంపద సేకరించే ఆదివాసీలు, మేదర్లు, చాకళ్ళు, మంగళ్ళు, హోటల్ కార్మికులు, కమీషన్ ఏజెంట్లు, దర్జీలు, ఆటోలు, రిక్షాలు నడిపేవారు, తోపుడుబండ్లపై వ్యాపారం చేసేవారు, లారీ డ్రైవర్లు, హమాలీలు, మేస్త్రీ పనిచేసేవారు, కూలీలు, కంప్యూటర్, రేడియో, టి.వి., గడియారం, సెల్‌ఫోన్, మోటర్ల, ఇంజన్ల మెకానిక్‌లు, కేబుల్ టీవీలు నిర్వహించేవారు, పాచిపనిచేసేవారు, రోడ్లు ఊడ్చేవారు, చెత్త ఏరుకునేవారు, ఇళ్ళల్లో ఎలక్ట్రిక్, డ్రైనేజి మొ॥ పనులు చేసేవారు. వీరంతా సుమారు 50 కోట్లమంది ఉంటారు. వీరంతా అతి కష్టంమీద జీవితాన్ని సాగిస్తూ 2వ తరగతి పౌరులుగా, వెనుకబడినవారిగా, అనాగరికులుగా, విద్యలేనివారుగా చెప్పబడుతున్నారు. వీరికి సంవత్సరంలో ఆరేడునెలలు మించి పనిదొరకడం లేదు. వీరి చదువు పదోతరగతి మించదు.

ఇక చదువుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నవారు సుమారు 22 కోట్లమంది ఈ రోజు చిరుఉద్యోగాలు చేయటం లేదా ఉద్యోగాన్వేషణలో మునిగితేలుతూ ఉంటారు. వీరిలో కొంతమంది రియల్ ఎస్టేట్ ఏజంట్లుగా, ఇంటింటికీ తిరిగి వస్తువులు అమ్మేవారుగా, లంచగొండి ఉద్యోగస్తుల ఏజంట్లుగా, ఆఫీసుల చుట్టూ, ఇళ్ళుచుట్టూ తిరుగుతున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల ఏజంట్లుగా, అధికారుల మీద గుండాగిరీ చెయ్యటాన్ని, దొంగ ఓట్లు వేయించటాన్కి, దౌర్జన్యంగా స్థలాలు, భూములు ఆక్రమించటాన్కి, సెటిల్‌మెంట్లకీ తిరుగుతూ వ్యతిరేక పరిస్థితులలో జైళ్ళకు వెళుతున్నారు. విశ్వవిద్యాలయాల్లో చదువుకుని, అవినీతికి దూరంగా ఉండేవాళ్ళంతా తమకు సరైన ఉపాధి దొరకడం లేదని కుమిలిపోతూ మానసిక రోగులుగా మారుతున్నారు. వీరంతా మూడవ తరగతి పౌరులుగా జీవనాన్ని గడుపుతున్నారు. తల్లిదండ్రులకు, సమాజానికీ వీరు భారంగా మారుతున్నారు. కొంతమంది విదేశాలకు వెళ్ళి హీనమైన పనులు చెయ్యటానికీ వెనుకాడటం లేదు. ఇంకొంతమంది మతోన్మాదులుగా, అతివాదులుగా, టెర్రరిస్టులుగా కూడా మారుతున్నారు.

ఇదే సమయంలో అతికొద్దిమంది పారిశ్రామిక వేత్తలు, ఎగుమతి - దిగుమతిదారులు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, లంచగొండి ప్రభుత్వోద్యోగులు, విద్యా వైద్యరంగాల్లో పెట్టుబడిదారులు, కంట్రాక్టులు చేసే గుత్తేదారులూ పదుల, వందల, వేల కోట్ల నుంచి లక్షల కోట్లకు పడగెత్తుతున్నారు. వీరంతా కోటిలోపే ఉన్నప్పటికీ వీరి ఆస్తులు దేశంలోని 129 కోట్ల ప్రజలందరికీ చెందిన సంపదంతా అంటే అతిశయోక్తికాదు.
స్వాతంత్ర్యం వచ్చిందిందుకేనా!

పోయిన 400 సంవత్సరాల నుండి భారతదేశంలోని అభివృద్ధి విదేశీపాలకులైనా, స్వదేశీపాలకులైనా పెద్ద ఎత్తున నీటిపారుదల ప్రాజక్టులు కట్టడానికీ, విశాలమైన రహదారులు నిర్మించటానికీ, అడ్డూ అదుపు లేకుండా ఏర్పాటు చేసిన పెద్ద పరిశ్రమలకూ, వందల వేల ఎకరాల గనుల్ని తవ్వేస్తూ, అడవుల్ని నరికేస్తూ, ప్రజల్ని నిరాశ్రయుల్ని చెయ్యటాన్కి, కుటీర, చేతి పరిశ్రమలు, దేశవాళీ వంగడాలతో, చిన్న నీటివనరులతో చేసే వ్యవసాయాన్ని నాశనం చెయ్యటానికే జరిగింది. చేతి వృత్తులు, చిన్న నీటి వనరుల ఆధారిత అంతర్పంటల వ్యవసాయాన్ని నాశనం చేస్తూ, వీటిమీద ఆధారపడిన వార్నందర్నీ రెండవ మూడవ తరగతి పౌరులుగా మార్చటం జరిగింది. గ్రామాలనుంచి వలస వచ్చిన వారికి సరైన ఇళ్ళులేక వారు పట్టణాలలోని నీటివనరుల ఒడ్డున మురికి కూపాల్లో జీవించడం జరుగుతోంది.

అభివృద్ధి పేరుతో కొద్దిమంది చేతిలో దేశ సంపదంతా పోగుపడే ఆర్థిక విధానాలనవలంబించటం జరిగింది. విద్యుత్ వాడకం, భూగర్భజలాలు విపరీతంగా వాడటం పెరిగిపోవటంతో పాటు గనుల వల్ల, పరిశ్రమలవల్ల, వాహనాల వల్ల వాతావరణం పూర్తిగా మారిపోయి అకాలవర్షాలు, దుర్భిక్షపరిస్థితులు, వాతావరణం వేడెక్కి పోవటం, మంచు కరిగిపోవటం ఆకస్మిక వరదలు, తీరప్రాంతాలన్నింటినీ సముద్రం తనలో కలుపుకుపోవటానికి దారితీసింది. జన్యుమార్పిడి విత్తనాలు, ఏకపంట విధానాలు, విపరీతంగా ఎరువుల, పురుగుల మందుల వాడకంతో సగం మంది భారతీయుల్లో ఏదో ఒక జబ్బు - శ్వాసకోశవ్యాధులు, చర్మవ్యాధులు, క్యాన్సర్లు, మధుమేహం, మానసిక వ్యాధులు పెరిగిపోయాయి. ప్రభుత్వ వైద్యం స్థానే కార్పొరేటు వైద్యశాలల వారికి వేల కోట్లలో ప్రభుత్వం రీయింబర్సుమెంటు పేరుతో కట్టబెట్టడం జరిగింది. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు నిధులు తగ్గించి ప్రైవేటు వారికి వేల కోట్లు ప్రజాధనం ప్రతీ సంవత్సరం ఇవ్వటం జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కళాశాలల్లో చదివిన వారికి ఉద్యోగాలు రావనే ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే అభివృద్ధి కొద్దిమంది వ్యక్తులకోసం ప్రజాపాలన పేరుతో ప్రజల్ని కులాల, మతాల, ప్రాంతాల, భాష ఆధారిత భేదాలతో విభజించటం, పెట్టుబడుల సమీకృతానికి ప్రజలందర్నీ బిచ్చగాళ్ళుగా, తెల్లకార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు, ఫీజురాయితీలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో అడుక్కునేవారిగా తయారు చేయటానికి ఉపయోగించారు. ఒకనాడు ప్రతీ భారతీయ కుటుంబం ఒక ఉత్పత్తి వ్యవస్థగా ఉన్న దాన్ని విచ్ఛిన్నం చేసి ఉద్యోగమో రామచంద్రా అని అడుక్కునే స్థాయికి దిగజార్చారు. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాల కోసం కులంపేరుతో, మతం పేరుతో, ప్రాంతం పేరుతో ఉద్యమాలు చేయటం, ఈ రోజు పాటేదార్లు గుజరాత్‌లో, జాట్లు పంజాబ్, హర్యానాలో, కాపులు ఆంధ్రప్రదేశ్‌లో, ముస్లింలు వివిధ రాష్ట్రాల్లో, గుజ్జర్లు రాజస్థాన్‌లో ఉద్యోగాల్లో, చదువుల్లో రిజర్వేషన్లు కావాలని ఉద్యమాలు చేస్తున్నారు. అన్నికులాల్లో, మతాల్లో, ప్రాంతాల్లో నిరుద్యోగం తాండవిస్తున్నప్పటికీ ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల పై చర్చను ప్రస్తుత రాజకీయ పార్టీలన్నీ ఈ దేశంలో ముందుకురానివ్వటం లేదు.
మొట్టమొదటి ప్రత్యామ్నాయం అవినీతి అరికట్టడానికి రూ. 100, 500 మరియు 1000 నోట్లు రద్దు చేసి బ్యాంకుల ద్వారా మాత్రమే ఆర్థిక లావాదేవీలు జరపటం.

ఈ రోజు ఎం.ఆర్.ఓ. ఆఫీసులలో, ఆర్డీవో ఆఫీసులో, కలెక్టరాఫీసులో, రిజిస్ట్రేషన్‌లో, ఆర్.టి.ఏ. ఆఫీసులో, కోర్టులలో పని చేసేవారే కాక వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసేవారు వారి తాహతుకు మించి కూడబెట్టడం ఖర్చు చేయటం జరుగుతోంది. హైదరాబాద్ ప్రశాసన్ నగర్ (కలెక్టర్లు, ఎస్పీలు మొ॥ వారుండే కాలనీ) ఇళ్ళ సింహద్వారం, ఖరీదుతో ఒక డబల్‌బెడ్‌రూమ్ ఇల్లు కట్టవచ్చంటే అతిశయోక్తి కాదు. జడ్జీల ఇళ్ళన్నీ రాజభవనాలేకాక వారి బంధుమిత్రులందరికీ ఉద్యోగాలు పెద్ద చదువులతోపాటు అత్యంత ఖరీదైన విలాసవంతమైన జీవితాలెలా దొరుకుతున్నాయి? అన్ని జిల్లాల్లోనూ, హైకోర్టులోనూ ఒకే కుటుంబానికి చెందినవారు ఉద్యోగాలెలా పొందుతున్నారు? అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో నోట్లెలా పంచగలుగుతున్నారు? రిజిస్ట్రేషన్ ఖర్చులు తగ్గించి కొంత తెల్లధనం ఇచ్చి మిగతాది నల్లధనం ఇవ్వటానికి ఏ రూపాయ నోట్లను వాడతారు?

సామాన్యుడికి ఒకరూపాయి, 5 రూ., 10 రూ., 20 రూ.లు, 50 రూ.లు ఖర్చుచేయటం గగనంగా ఉన్న ఈ రోజుల్లో కొంతమంది వద్ద విపరీతంగా పెద్ద నోట్లెక్కడివి? ఈ రోజు చలామణీ అవుతున్న నగదులో 80-90 శాతం 500 లేదా 1000 రూపాయల నోట్లంటే నమ్మగలరా! భారతదేశంలో 80 శాతం మందికి దినసరి ఆదాయం 50 రూ. లలోపు ఉన్నప్పుడు ఈ 100, 500, 1000 కాగితాల రద్దు అవసరమే కదా! వీటి రద్దును వద్దనే వారంతా అవినీతిలో కూరుకుపోయిన వారే. అందుకే మొదటి ప్రత్యామ్నాయం అన్ని ఆర్థిక లావాదేవీలు బ్యాంకుల ద్వారా మాత్రమే జరగాలి. దానితో చిన్న నోట్లకు రూ. 1, 2, 5, 20, 50 లకు విలువ పెరుగుతుంది. సామాన్యుడు బ్రతక కల్గుతాడు. అవినీతికి అడ్డుపడుతుంది.
రెండవ ప్రత్యామ్నాయం విద్య మరియు వైద్యం ప్రభుత్వ రంగంలో మాత్రమే ఉండాలి!

వైద్యరంగంలో జరిగే అవినీతి ఈ రోజు వందల, వేల, లక్షలో కాదు, కోట్లమంది ప్రాణాలు తీస్తోంది. డబ్బుకోసం, 4-5 రకాల పరీక్షలు, కొద్ది కంపెనీల మందులు ఖరీదైనవి వాడటం, నిపుణుల పేరుతో తప్పుడు వైద్యం చేయటం, చనిపోయిన వారిని వెంటిలేటర్‌పై పెట్టి కృత్రిమ శ్వాసను చూపుతూ లక్షల రూపాయల బిల్లులు తీసుకోవటం పద్ధతిగా జరిగిపోతోంది. వంద రూ. జనరిక్ మందుల్ని వేలల్లో అమ్మటం, డాక్టర్లు, కార్పొరేట్ వైద్యంలో పనిచేసే వారంతా విచ్చలవిడిగా ఖర్చుచేస్తూ మానవత్వం లేకుండా రోగుల్ని పిండుకుంటున్నారు. జబ్బుల వైద్యంకోసం పొలాల్ని, బంగారాన్ని, ఇళ్ళువాకిళ్ళను కూడా సామాన్యులు అమ్ముకొంటున్నారు. లక్షల కోట్ల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగుల, ప్రజా ప్రతినిధుల, స్వాతంత్ర సమరయోధులతోపాటు ఆరోగ్యశ్రీ పథకం, తెల్లకార్డు పేరుతో చెల్లిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల నిధుల కేటాయింపులు వందల కోట్లలో మాత్రమే జరుగుతోంది. అందుకే వైద్యంలో ప్రైవేటు ఆసుపత్రుల్ని జాతీయం చేయాలి.

ఇక విద్యారంగంలో వైద్య, దంత, లా, ఇంజనీరింగు కళాశాలలతో పాటు కార్పొరేటు స్కూళ్ళు, కాలేజీలు ప్రభుత్వాన్నుంచి రాయితీలు, రీయింబర్సుమెంట్లు, గ్రాంట్లుతోపాటు డొనేషన్లు లక్షల కోట్లు వసూలు చేస్తున్నాయి. మంచి చదువు పేరుతో ఆస్తులు అమ్ముకుని చదివిస్తున్నారు. వీరంతా లక్షలలో జీతాలు వస్తాయని చదివి పదివేలు కూడా దొరక్క మానసిక రోగులుగా తయారవుతున్నారు. దీని పరిష్కారం ప్రైవేటు విద్యారంగాన్ని రద్దు చేయాలి.

మరో ప్రక్క ప్రభుత్వోద్యోగులు ముఖ్యంగా కులం సర్టిఫికేట్లు ఇన్‌కం సర్టిఫికేట్లు, రిజిస్ట్రేషన్ కాగితాలు, ప్రభుత్వ విత్తనాలు, లోన్లు, వితంతు పింఛన్లు, ఓల్డేజి పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆదాయపు పన్ను, వాణిజ్య పన్ను, కోర్టులు మొ॥లైన విభాగాల్లో పనిచేసే చిరుద్యోగులు, ఆఖరికి ఈ సేవ మీ సేవ వాళ్ళు కూడా ప్రతిరోజూ జేబునిండా డబ్బులు తీసుకువెళ్ళటం చూడటంతో ఈ మధ్య 25 ఆఖరి తరగతి ఉద్యోగాలకోసం 25,000 మంది చదువుకున్నవాళ్ళు (ఇంజనీరింగు, ఎంసిఏ, ఎంబిఏలతో సహా) దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇటువంటి అవినీతితో సామాన్యులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

వరదలు, వర్షాభావం, తుఫాన్లు, అంటురోగాలు, ప్రమాదాలపై రిపోర్టులు పంపి ప్రభుత్వ సాయం అందజేయాల్సిన వాళ్ళు ప్రతి రోజు పండగలు చేసుకోవటమే కాకుండా వందలకోట్ల ఆస్తులు సంపాదించు కుంటున్నారు. అవినీతి నిరోధక శాఖలోనే అవినీతి భూతం సంచరించటం మామూలే.

అందుకే ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారా జరపడం, వైద్యం విద్య ప్రభుత్వ రంగానికి పరిమితం చేయటం మొదటి రెండు పరిష్కారాలు. చివరగా ఉద్యోగార్హత ఉన్న 70 కోట్లమందికీ 3 కోట్ల 20 లక్ష మందితోపాటు కనీస వేతనం ప్రతినెలా వచ్చే చట్టం చేయాలి.

70 కోట్ల అసంఘటిత రైతులు, రైతుకూలీలు, వృత్తి కారులు మొదలైన వారంతా వారివారి జ్ఞానంతో తయారుచేస్తున్న, ఉత్పత్తి చేస్తున్న సరుకులవల్లే 130 కోట్ల భారతీయులు బ్రతుకుతున్నారు. వీరి ఉత్పత్తికి ఉన్న జ్ఞానానికి ఎటువంటి సర్టిఫికేట్లు లేవు. కానీ వీరిజ్ఞానం ప్రకృతి, సమాజం, నైతికత ధర్మం, న్యాయం అనే సూత్రాలపై ఆధారపడి తరతరాలుగా ఆచరణలో ఉండి ఈనాడు అతలాకుతలానికి లోనౌతోంది ఇదే లోకవిద్య.

ప్రపంచీకరణ పేరుతో ఎవ్వరైనా ఎక్కడైనా ఉత్పత్తిచేసిన వస్తువులు ప్రపంచంలో ఎక్కడైనా ఏ ధరకైనా అమ్ముకుని ఎంతైనా సంపాదించుకోవచ్చనే విధానం 90వ దశకం నుంచి ప్రారంభమైంది. స్థానిక అవసరాలను కాదని ఎగుమతుల కోసం మాత్రమే అంటే అమ్ముకోడానికి మాత్రమే అన్ని కార్యకలాపాలు జరుపుతున్నారు. దీనితో ఉత్పత్తి చేసే కార్మికులకు వస్తువుల ధరపై నియంత్రణ లేదు. తెల్లారిలేస్తే ఏవిధంగా ప్రతీ పురుషుడు, స్త్రీకి ఖచ్చితమైన ఉద్యోగ ఉపాధి కల్పించి ఎటువంటి ఆందోళనకూ గురి కాకుండా సరైన సంపాదన చెల్లిస్తే వారిజ్ఞానంతో వారు మన సమాజవసరాలను తీర్చటం కోసం మరింత నాణ్యత కల్గిన చౌకధరలో వస్తువులు, సేవలూ అందించగల్గుతారు. అందరికీ ఎప్పుడైతే ఖచ్చితమైన వేతనంతో ఉపాధి దొరుకుతుందో వారు రాజకీయ నాయకుల్ని, లంచగొండి ప్రభుత్వోద్యోగుల్నీ ఆశ్రయించటంగాని, మోసాలు, దొంగతనాలు చేయటంగాని, ఉద్యమాలు, ఆందోళనలు చెయ్యటంగాని, ఆధర్మం, అక్రమాలకు పాల్పడటం కాని చేయరు. ఎప్పుడైతే తమ స్వంత గ్రామంలోనే ప్రభుత్వోద్యోగుతో సమంగా వేతనం దొరుకుతుందో వారంతా తమ పిల్లల్ని పనుల్లో పెట్టకుండా విద్యాభ్యాసానికి పంపి, ముసలివాళ్ళను, తల్లిదండ్రుల్ని చూసుకుంటూ ఆనందంగా జీవితాల్ని గడుపుతారు.

ఇక సమస్య - అందరికి ఎలా ఉద్యోగాలివ్వాలనేదే. ఉదాహరణకు ప్యాకింగుకు తాటిబుట్టలు, వెదురుబుట్టలు, నూలు సంచులు, మాత్రమే వాడలనే చట్టంతో కొన్నిలక్షలమంది మేదర్లకు, దర్జీలకు, ప్రత్తి రైతులకు, చేనేతన్నలకు ఉపాధి కల్పించవచ్చు. మరియు పర్యావరణాన్ని రక్షించవచ్చు. వీటిలో వచ్చే వ్యర్థాలన్నీ కొద్దివారాలలో మట్టిలో కల్సిపోయి ఎరువవుతాయి. దేశ ప్రజలంతా నూలు, లేదా ఉన్ని బట్టలు మాత్రమే వాడాలనే నిబంధనతో పత్తిరైతులు, గొర్రెమేకపెంపకందార్లు, చేనేతన్నలు, చాకళ్ళు లక్షలమంది ఉపాధి పొందుతారు. పాతబట్టలు కొద్ది వారాలలో మట్టిలో కల్సిపోతాయి.

చౌకగా సూర్యరశ్మి, గాలిమరలు, గోబర్‌గ్యాస్ వల్ల మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేయాలనే చట్టం తెస్తే స్థానిక మెకానిక్‌లకు, పశుపెంపకం దార్లకు, కుటీర పరిశ్రమలకు మేలు జరుగుతుంది. ఏక పంట విధానాన్ని ఆపి, బహుళపంటల విధానాన్ని అవలంబిస్తే విభేదాలు తగ్గుతాయి. స్థానిక వంగడాల ఉత్పత్తి, నిల్వ సరఫరా రంగాల్లో లక్షలమంది ఉపాధి పొందుతారు. మధ్యాహ్నభోజన పథకంలో జొన్న, రాగితోపాటు గింజలు ఇతర తృణధాన్య పంటలతో ఆహారం పెడితే, మెట్టప్రాంత రైతులకు 365 రోజులు పనిదొరుకుతుంది. అంటే ప్రభుత్వ ఉత్పత్తి వినిమయ విధానం అందరికి ఉపాధి కల్పించటమే కాకవారి ఉద్యోగుల వేతనాలతో సమంగా ఉండాలి.

విద్య, వైద్య రంగాల్ని పూర్తిగా ప్రభుత్వమే నడిపితే ప్రతీ గ్రామంలోనూ ఒక డిస్పెన్సరీ, ప్రతీ మండలంలోనూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నడిపితే కోట్లాదిమందికి సరైన వైద్యం దొరకటమే కాక లక్షల మందికి ఉపాధి దొరుకుతుంది. ఇంకా ఇంకా సంపాదించాలనే విధానం ప్రపంచ వ్యాప్తంగా ప్రవేశపెట్టడం అత్యవసర వైద్యానికి లక్షల రూపాయలు ఇళ్ళు, వాకిళ్ళు చివరికి వంటిమీద నగలతో నిలువుదోపిడీ చెయ్యటానికి డాక్టర్లు, అత్యవసర పరిస్థితులలో గమ్యం చేర్చటానికి వందల రూపాయలడిగే ఆటోలూ, సర్టిఫికేట్లు ఇవ్వటానికి వేల రూపాయలు, లైసెన్సులివ్వటానికి కోట్ల రూపాయలు, ఈ విధంగా ప్రతీ వ్యక్తి అవకాశాన్ని బట్టి సమాజాన్ని దోచుకుంటున్నారు. డబ్బు, కులం, సంఖ్యాబలంతో స్థానిక నాయకులు సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. డబ్బుతోనే అన్నీ సాధించవచ్చనే భావజాలాన్ని అందరూ పాటించవలసి వస్తోంది. ఇదే ఈనాటి సమాజాన్ని విలువలు లేని సమాజంవైపు వడివడిగా నడిపిస్తోంది. ముసలివాళ్ళను తల్లిదండ్రుల్ని ఇళ్ళనుంచి పంపించి వృద్ధాశ్రమాల్లో ఉంచటం, భూమిల్నీ, ఇళ్ళనీ అతి తక్కువ ధరలకు అవసరాలకు డబ్బిచ్చికొని, అత్యంత ధరకు అమ్ముకోవటం, రైతు దగ్గర రూపాయి లేదా రెండ్రూపాయలకు కిలో కొని దాన్నే 40 రూ॥లకు అమ్ముకోవటం తెలివితేటలనే నూతన పద్ధతిని ప్రాచుర్యంలోకి తెస్తున్నారు.

ఒక 100 సంవత్సరాల క్రితం గ్రామాల్ని తల్చుకుంటే మనకేం గుర్తుకొస్తాయి? పది-పది హేనుమంది కుటుంబం అందరూ ఒకే వృత్తి లేదా ఉత్పత్తిరంగంలో ఉండేవారు. ప్రతీ కుటుంబం ఒక చిన్న ఉత్పత్తి కేంద్రం. వీరి ఉత్పత్తుల్ని స్థానిక అవసరాల మేరకు నియంత్రించేవారు. జీవన ప్రమాణాల్లో కొన్ని హెచ్చుతగ్గులున్నా డబ్బు మాత్రమే జీవితాల్ని ప్రభావితం చెయ్యలేదు. నోటిమాటపై తండ్రి తీసుకున్న అప్పు కొడుకు తీర్చాలనే సత్య కాలమది. అన్ని రకాల పంటలూ తమ తిండిబట్టలకు పనికి వచ్చేవే. అన్ని వృత్తులూ తమ ఇళ్ళు, రోడ్లు మొత్తం గ్రామం లేదా పది పన్నెండు గ్రామాల చుట్టూ తిరుగుతుండేవి. అందరికి ఉపాధి దొరికేది. వారి జ్ఞానం వారిని నడిపేది ధర్మంగా.

వీరి జ్ఞానంతో చేసిన ఉత్పత్తులకు నేడు కిట్టుబాటు ధర దొరక్క పట్టణాలకు వలసపోవటం, ఇళ్ళు లేక నాలాలకు చెర్వుగట్లుకు అడ్డంగా గుడిసెలు వేసుకోవటం దయనీయమైన వేతనాలకు శారీరక శ్రమచేసే ఉద్యోగంలో తమ జ్ఞానాన్ని మర్చిపోయి జీవించటం మామూలైపోయింది. దీనివల్ల అతికొద్దిమంది 70 కోట్లమంది పై పెత్తనానికి దారితీసింది. దానికి ప్రత్యామ్నాయంగా అందరికీ ప్రభుత్వోద్యోగి వేతనంతో సమానంగా ఉపాధి కల్పించి వారి జ్ఞానంతో వారుత్పత్తి చేసిన వస్తువుల్ని సమాజం / ప్రభుత్వం కొనాలి. అలాగే వ్యాపార, పారిశ్రామిక రంగంలో చిన్నతరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలు మాత్రమే అనుమతిస్తూ చిరువ్యాపారులకు పూర్తిగా పంపిణీ విధానాన్ని అప్పగిస్తే కోట్లాదిమందికి ఉద్యోగాలు దొరుకుతాయి.

ఎరువులు, పురుగు మందులు కృత్రిమమైనవి పూర్తిగా నిషేధిస్తే చిన్న నీటివనరులనన్నీ అభివృద్ధిచేస్తే, అంతర్పంటలను ప్రోత్సహిస్తే కోట్లాదిమంది రైతులు, రైతుకూలీలు ఉపాధి పొందుతారు. స్థానిక సివిల్ డిప్లొమో ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుంది.

ఎప్పుడైతే లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారా మాత్రమే జరుగుతాయో, అన్ని రకాల పన్నులు బ్యాంకు లావాదేవీల పన్నుతో మాత్రమే దేశంలోని వనరులు చేసిన పన్నుల తక్కువ వేతనాలిచ్చిన వారికి మాత్రమే నగదు జమచేసి అందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమంగా వేతనాలందిస్తే కాని ప్రస్తుత సమాజరుగ్మతలు, నేరాలు, లంచాలు, ఆత్మహత్యలు ఆగవు.

- నారాయణరావు

# సామాజిక న్యాయంకోసం ఎన్నికల్లో పాల్గొనాలి

సామాజిక న్యాయం కోసం బీహారు రాష్ట్రంలో అనేక ఉద్యమాలు జరిగాయి. అణగారిన, అణచివేతకు గురౌతున్న ప్రజలంతా 25 సంవత్సరాల నుండి సామాజిక న్యాయంకోసం పోరాడుతున్న సంగతి మనందరికి తెల్సు. చదువుకున్న వర్గాల నాయకత్వంలో గ్రామీణ ప్రజలంతా ప్రారంభించిన సామాజిక న్యాయ ఆందోళనలు చివరగా రిజర్వేషన్ల కోసం జాట్లు, గుజ్జర్లు ఇప్పుడు పటేళ్ళ కులాలు కూడా అడగడానికి దారితీశాయి.

నేడు సామాజిక న్యాయంకోసం కొత్త మార్గాలు అన్వేషించాల్సిన పరిస్థితులు మనముందున్నాయి.

ఇన్నాళ్ళూ అసంఘటితమైన మరియు సంఘటితమైన శ్రామికవర్గాలు రెండూ తమ శత్రువు ఒక్కరేనని గుర్తించటం మొదటి మెట్టు. అదుపు లేకుండా కొద్దిమంది వద్ద సంపద పోగుపడటం ఒకవైపు దిగువమధ్య తరగతి ప్రజలంతా దారిద్ర్యం నుంచి కటికదారిద్ర్యం వైపు నెట్టివేయబడటం గుర్తించిన సంఘటిత, అసంఘటిత కార్మికవర్గాలు రెండూ ఏకోన్ముఖంగా సమీకృతం కావటం రెండోమెట్టు. అందుకే నేటి అవసరం కార్మిక సంఘాలున్న కార్మికులు, కార్మిక సంఘాలు లేని కార్మికులు ఐక్యంగా నిలబడితే సామాజిక మార్పు సాధ్యమే.

పెద్ద పెద్ద కంపెనీ ఉద్యోగస్తులు, కేంద్ర, రాష్ట్ర స్థానిక సంస్థల ఉద్యోగస్తులు మాత్రమే నేటిదాకా సంఘటిత పడి సంఘాలుగా ఏర్పడ్డారు. వీరందరికి నేడు కనీస వేతనం 30 వేల రూపాయలతోపాటు ఇతర సదుపాయాలు (ఉచిత వైద్యం, విద్య తమ కుటుంబాలతోపాటు ఇళ్ళు, లోన్లు) లభిస్తున్నాయి. ఈ వర్గం కోసం వేతన సంఘం మరియు కరువుభత్యం వర్తింపచేస్తున్నారు. ఇక మిగతా శ్రామికవర్గాలన్నీ తమ జ్ఞానంతో, నైపుణ్యంతో ఎంత కష్టపడినా 5 నుంచి 8 వేల రూపాయల వేతనం పొందటం కష్టంగా మారింది. వీరిలో స్త్రీ, పురుషులు రైతులు, చేనేతన్నలు, వృత్తి విద్యాధరులు, ఆదివాసీలు, గిరిజనులు, తోపుడుబండ్లవారు, చిన్నషాపులవారు, దినసరి కూలీలు మొదలైన వారంతా ఉన్నారు. నేటి ప్రభుత్వాలు అందరికీ ఉపాధితో పాటు ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనం దొరికే ఏర్పాట్లు చేయాలి. మనదేశంలో ప్రతీ కార్మికుడికీ, వృత్తిదారుడికీ వేతన సంఘం నిర్ధారించిన కనీస వేతనం దొరకాలి.

ఈనాడు పనిచేయకల్గిన ప్రతీ కార్మికుడి వద్ద, వృత్తి విద్యానిపుణులవద్దా ఉన్న జ్ఞానంతో, నిపుణతతో చేసేపనికి సరైన గుర్తింపు లభించకపోవటమే తీవ్ర సాంఘిక అసమానతలకు దారితీస్తోంది. అనేక వృత్తులు చేసుకునే ప్రజా బహుళ్యం వారి కుటుంబాల పోషణ కోసం తమ జ్ఞానాన్నీ నిపుణతను సర్వశక్తుల్నీ ఒడ్డినా సరైన వేతనం లభించటం లేదు. విశాల ప్రజానీకం తమంతట తామే ప్రభుత్వ మద్దతూ, నిధులూ లేకుండా అనేక విద్యల్లో నిపుణత సంపాదించినా, వారికి సరైన గుర్తింపు నేటి సమాజంలో దొరకక పోవటమే ఉద్రిక్తతలకు కారణం. వీరంతా అపారజ్ఞానం కల్గి, పనిచేసే చోటే అనేక మెలకువలు నేర్చుకుని, దానితో తమ మేధస్సును మేళావించి వస్తూత్పత్తులు, సేవలు అందిస్తున్నారు. ప్రతీ కొత్త అవసరానికీ స్థానికంగా తమ లోకజ్ఞానంతోనే వీరు మార్గాలను కనిపెట్టడం అందరం గమనిస్తున్నా ఆర్థికంగా తమ కాళ్ళపై నిలబడడానికి ప్రభుత్వ అండదండలు లేవు.

ప్రభుత్వం నేడు విశ్వవిద్యాలయాలు కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో చదివి సర్టిఫికెట్లు పొందినవారికి మాత్రవే మద్దతిస్తూ ఈ విశాల లోకవిద్యాధరులను ఉపేక్షించటం నేటి దుస్థితికి కారణం. అందుచేత లోకవిద్యా జనాందోళన ప్రతి పనిచేయకల్గిన వారికీ ప్రభుత్వోద్యోగులతో సమానంగా ప్రతీ నెలా ఖచ్చితమైన వేతనం దొరికేలా చేయాల్సిన అవసరాన్ని ప్రచారం చేస్తోంది.

ఇటువంటి ఆర్థిక విధానాన్ని అవలంబించిన రాజకీయ పార్టీలకు మాత్రమే ఓటువెయ్యాలని పిలుపిస్తోంది. **- దిలీప్‌కుమార్ "దిలి" మరియు లక్ష్మీప్రసాద్**

**- బీహారు ఎన్నికల సందర్భంగా లోకవిద్యాజనాందోళన కరపత్రం**

# లోకవిద్యా విధానానికి తిలోదకాలిచ్చిన పాపానికి ప్రకృతి తిరుగుబాట్లు

**అయినా మనిషి మారలేడు!**

చెన్నైలో జరిగిన, జరుగుతున్న ముంపు మనుషుల్లోని మానవత్వాన్ని బయటకి తెచ్చిందని అన్నారొక మిత్రుడు. నిజమే, ఇటువంటి ఉపద్రవాలు జరిగినప్పుడు అందరూ కలిసి వస్తారు. 2009లో జరిగిన కర్నూల్ వరదలు, కేదార్‌నాథ్‌లో వచ్చిన వరద భీభత్సం, గత సంవత్సరం వచ్చిన హుదుద్ తుఫాన్ తర్వాత, అనేకమంది సహాయం చెయ్యడానికి ముందుకు వచ్చారు. ఇప్పుడూ అలాగే వస్తున్నారు. ఇక ప్రభుత్వాలయితే వరద నిధులకోసం కేంద్రాన్ని ఆశ్రయించడం షరా మామూలే. ఎంత సేపూ ప్రకృతి వైపరిత్యాలు వచ్చిన తర్వాత సహాయక చర్యల గురించి ఆలోచిస్తున్నాం గాని, ఎందుకు ఇలా జరుగుతోంది అని ప్రశ్నించడం లేదు. ఇవి రాకుండా మనం చెయ్యవలసినదేమిటి అని కూడా చర్చ జరగదు. సమస్య ఉన్న కొన్ని రోజులు ఇదంతా బ్రేకింగ్ న్యూస్ అవుతుందే తప్ప. అది సద్దుమణిగిన తర్వాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంటుంది. ఈ విషయమే ఫేస్‌బుక్‌లో రాసాను. దానికి ఒక చెన్నై పెద్దమనిషి ఇలా సమాధానం రాసారు. నాకు వేరే దగ్గిర జరిగిన వైపరీత్యాలు గురించి చర్చించాలని లేదు. కేవలం చెన్నైలో సహాయక చర్యలు, పునరావాసం గురించి మాట్లాడండి. అన్నారు. మరి ఏమైంది సో కాల్డ్ మానవత్వం? మనందరికీ ఈ మధ్య ఘజిని లాగా షార్ట్ టర్మ్ మెమరీ లాస్ జబ్బు పట్టుకుంది. కేదార్నాథ్ వరద భీభత్సంలో కొన్ని వేల మంది ఆంధ్రులు చనిపోయారు. దానికి కారణం అక్కడ మన ఆంధ్రా పెట్టుబడిదార్లు కట్టుతున్న వందల సంఖ్యలో వున్న డ్యాంలు, టన్నెల్ బేస్డ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు అని తెలిసినాక కూడా, ఇంకా హిమాలయాలపైన హింస ఆగలేదు. ఇది ప్రకృతి పైన జరుగుతున్న హింస కాకపోతే మరి ఏమిటి? అందుకే ప్రకృతి కూడా తన ఉగ్రరూపం చూపిస్తోంది. హుద్దుద్ భీభత్సానికి, ప్రస్తుతం చెన్నైలో, నెల్లూరులో జరుగుతున్న విపరీత పరిస్థితులకీ, దేశం అంతటా తాండవిస్తున్న కరువుకి కూడా మానవ తప్పిదాలే కారణం. కాని ఏమి జరిగినా, మనకేం కాదులే అన్న ధీమా ఉన్నది మన సగటు మధ్యతరగతి, ఉన్నత వర్గాల ప్రజలకి మరి ఇప్పుడు లక్షల జీతాలు తెచ్చుకుంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా ఆహార పొట్లాలకోసం చేతులు చాస్తున్నారు. మరి ఏమైంది ఆ సోకాల్డ్ టెక్నాలజీ? ఏ కంప్యూటర్ వచ్చి ఈ వర్ష భీభత్సాన్ని ఆపగలుగుతోంది?

కనీసం గత 20-30 సంవత్సరాలుగా వాతావరణ శాస్త్రవేత్తలు భూతాపం గురించి మాట్లాడుతున్నారు. వాతావరణంలో పెను మార్పులు వస్తాయి. అవి తట్టుకోలేని విధంగా వుంటాయి అని మనం 2016 లోపల కర్బన ఉద్గారాలని బాగా తగ్గించుకోకపోతే 2050 తరువాత మానవ మనుగడ కష్టమవుతుందని కూడా చెప్పేరు, చెప్తూనే వున్నారు. కాని, అభివృద్ధి అంటే వస్తు కొనుగోలు, సేకరణ, అనే ఒక మాయలో పడ్డ జనానికి, వాళ్ళని ఆ మాయలో పెట్టి జేబులు నింపుకుంటున్న నాయకులకి ఈ విషయాలు ఎక్కటంలేదు. ఒకవేళ ఎక్కినా, మనకి మాత్రం ఏమి కాదులే అన్న ధీమా వుంది కాబోలు. అందుకే ఎన్ని జరిగినా షరా మామూలే అన్నట్లు వుంది వ్యవహారం. ఒక ప్రక్క బొగ్గును తవ్వొద్దు, బొగ్గుతో కరెంటు చెయ్యొద్దు అని అన్ని దేశల్లో మొత్తుకుంటుంటే, భూమి మీద వేడి పెంచే థర్మల్ విద్యుత్ కేంద్రాలని, కోస్తా ప్రాంతమంతా పెడుతున్నారు. కాలుష్యాన్ని పెంచే రసాయన కర్మాగారాలు, విషం చిమ్మే పరిశ్రమలు పెట్టుకుంటున్నారు. పచ్చని పొలాలు, అడవి భూముల్లో కాంక్రీట్ జంగిల్ని తాయారు చేసే ప్రయాసలో వున్నారు గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారు. ఇప్పటికే ఆయిల్ రిఫైనరీలు ఉన్న ప్రాంతాలలో అనేక చోట్ల భూమి కుంగి మంచినీటి చెరువుల్లో, పొలాల్లో ఉప్పునీరు చేరుతోంది. రసాయన వ్యర్థాలతో సముద్రంలో చేపలు చనిపోతున్నాయి. కందిపప్పు 200 రూపాయలు వున్నా ఫర్వాలేదు, కరెంటు తిని బ్రతుకుతారు జనాలు అని అనుకుంటున్నారేమో మరి. ఆహార సమస్యలు, నీటి సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు ఇవి ఇంకా ఉద్రుతమయ్యే అవకాశం ఎక్కువగా వుంది. ఒక హుద్దుద్, ఒక నెల్లూర్ తుఫాన్లకే వేల కోట్ల నష్టం జరుగుతోంది. మరి ఈ ప్రకృతి ప్రమాదాల్లో ఆస్తి, ప్రాణాలు కోల్పోయిన భూతాపానికి కారణం కాని శక్తిని అతి తక్కువగా వాడుతున్న పేద ప్రజలకి జరుగుతున్న ప్రాకృతిక అన్యాయానికి శిక్ష ఎవరికి వెయ్యాలి? ఇది తెలిసి చేస్తున్న హత్యలు కావా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కరెంటు ఆదా చెయ్యండని అందరికి ఎల్.ఈ.డి. లైట్లు సరఫరా చేస్తున్నారు. సింగపూర్ తరహా కాంక్రీట్ అడవులు, ఫ్లై ఓవర్లు, మెట్రో రైళ్ళు కట్టుకుంటూ పోతే, ఎన్ని ఎల్.ఈ.డి.లు ఇస్తే ఏం లాభం? కాని ఇవ్వాన్నీ ఆలోచించే ఓపిక ఎవరికి వుంది?

పైగా రాష్ట్ర విభజన అనంతరం, నువ్వు సేరు అయితే, నేను సవా సేరు అని, ఇద్దరు ముఖ్యమంత్రులు రాష్ట్రాలని సింగపూర్ చేద్దామా, లేక సిడ్నీ చేద్దామా అని పోటీ పడుతున్నారు. కానీ వీటి ప్రభావం ప్రకృతి మీద, మానవాళి మనుగడ మీద ఎలా పడుతుందని ఒక్కసారైనా ఆలోచించడం లేదు. ఒక పక్క తెలంగాణాలో హరితహారం చేసి తెలంగాణాలో వర్షాన్ని తెద్దాం, కరువు లేకుండా చేద్దాం అంటూనే ఇకో పక్క ఉన్న అడవులని ఊడగొడుతున్నారు తెలంగాణా సర్కారు. ముచ్చెర్లలో పడకొండు వేల ఎకరాల్లో ఆరువేలు అటవీ భూమిని, ఐదువేల వ్యవసాయ భూమిని తీసుకుని, ప్రాణాంతకమైన ఫార్మా సిటీని పెడుతున్నారు. మరి శ్రీయుతులు కెసిఆర్ గారికి, ఇప్పటికీ రసాయన మందుల కంపెనీల కాలుష్యంతో కుదేలైన మెదక్ జిల్లా కనిపించలేదేమో? అసలే చలికాలంలో వేడితో తట్టుకోలేని పరిస్థితి, ఇంకా వచ్చే ఎండాకాలం ఇంకెంత వేడి వుంటుందో చెప్పలేం. ఈ వేడి చాలదన్నట్టు థర్మల్ విద్యుత్ కేంద్రాలని పెంచుతున్నారు. వీటికోసం ఓపెన్ కాస్ట్ బొగ్గు తవ్వకాలు పెరగాలి. ఇప్పటికే బొగ్గు గనులున్న ప్రాంతాల్లో, థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో, కేవలం వడ దెబ్బకి ప్రతి సంవత్సరం వందల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సంవత్సరం అసలు రాష్ట్రం అంతటా వేడి భరించలేనట్టు వుంది. శీతాకాలంలో కూడా ఎండాకాలం ఎండలు తలపిస్తున్నాయి. ఇక వచ్చే వేసవి ఇంకెంత భయంకరంగా వుంటుందో చెప్పలేం. వేడి పెరుగుతోందే తప్ప తగ్గటం లేదు. ఇప్పటికే రిజర్వాయర్లలో తాగే నీరు మాత్రమే వుందని, వ్యవసాయానికి నీరు లేదని అధికారులు చెప్తున్నారు. మరి నీటికి, తిండికి భవిష్యత్తులో ఏం చెయ్యాలి? పల్లెల్లో పంటలు ఎండిపోయి, ఏం చెయ్యాలో తోచక వున్నారు ప్రజలు. పనిలేని, పంటలు లేని చోట డబల్ బెడ్‌రూమ్ ఇళ్ళు వుంటే మాత్రం ఏమిచేస్తారు? ఇటుకలు, సిమెంటు తినలేరు కదా? గాంధీగారు ఎప్పుడో చెప్పారు. మనం యూరోప్ దేశాలవలే అభివృద్ధి చెందాలనుకుంటే, భూమి వంటి 6 గ్రహాల వనరులున్నా సరిపోవన్నారు. ఇప్పుడు అదే జరుగుతోంది. ఈ పరిస్థితుల్లోంచి బయటపడాలంటే మనకి కావలసినది సెన్సెక్స్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ కాదు, ప్రకృతి వనరులని కాపాడే ఆర్థిక వ్యవస్థ, అంతే కాని పులిని చూసి నక్కలు వాత పెట్టుకున్నట్టు, ఇంకా వాతలు పెట్టుకొంటూ పోతే మిగిలేది వాతలే! **- సరస్వతి కవుల, ప్రజాఉద్యమాల జాతీయ వేదిక**

# వైద్యుడు ఔషధము లేని మానసిక, శారీరక ఆరోగ్యం కొరకు ప్రాణయామం -సాధన

ఆరోగ్యము అనగా నేమి?

1. ఆరోగ్యము అనగా అనారోగ్యము (రోగము) లేకపోవుట అనునది ఒక సమాధానం. ఇది కొంతవరకు మాత్రమే సరియైన సమాధానం.
2. అన్నీ సమపాళ్ళలో ఉండుట అనునది రెండవ సమాధానం. అనగా బరువు, దాహము, చెమట, చలి, ఆకలి, నిద్ర, రక్తపోటు, మధుమేహము మొ॥ సమపాళ్ళలో ఉండుట అనేది రెండవ సమాధానం. ఇదికూడా సంపూర్ణము కాదు.
3. మరి ఏది సంపూర్ణ ఆరోగ్యము అంటే, మనిషి శరీరము అంతా పువ్వులాగా వుండి తనలో ఉన్న అనేక అవయవాలు తనకు స్ఫురణకు (గుర్తుకు) రాకుండుట. ఉదా॥ మనకు తల నొప్పి వస్తే ప్రతీ క్షణం మనకు తల గుర్తుకు వస్తుంది. అలాగే నొప్పి, మంట, వాపు సలువు ఉన్న భాగాలు గుర్తుకువస్తాయి. మనము ఆరోగ్యముగా ఉన్నప్పుడు మననుండి వేరుగా ఒక్క అవయవము మన గమనంలో (గుర్తు) ఉండదు. ఉదా॥ నడుస్తున్నప్పుడు కాళ్ళు ఉన్నాయని, మాట్లాడుతుంటే నాలుక ఉందని ఏవీ మనకు గుర్తుకు రావు. ఇది ఆరోగ్యకర శారీరక లక్షణము. మన గమనంలోకి ఒక అవయవము వచ్చింది అంటే, అది వ్యాధిగ్రస్థం అగుచున్నది అర్థము. సంపూర్ణ ఆరోగ్యములో మనకు వేరుగా అవయవము గమనమునకు రాదు. ఇది అసలైన ఆరోగ్య నిర్వచనం.

ఆరోగ్యంలో రకాలు

1. ప్రథమమున మానసిక ఆరోగ్యము దీనికే ప్రాధాన్యత ఎక్కువ, శరీర ఆరోగ్యముకంటే మానసిక ఆరోగ్యమునకు ప్రాధాన్యత ఇవ్వవలెను. అంటే భయము, కోపము, అసూయ, అనుమానము, అత్యాశ, లోభం, బద్ధకం, ఈర్ష్య, ద్వేషం, కీడు కలుగునని, లేనివి వున్నట్లు ఊహించడం ఇవి అన్నీ మానసిక అనారోగ్య లక్షణాలు.
2. శారీరక అనారోగ్యాలకుకారణం, మానసిక అనారోగ్యం. మనస్సు పాడైన తరువాత శరీరం అనారోగ్యం పాలవుతుంది. అధిక చెమట, అసలు చెమట పట్టకపోవడం, అధిక చలి, దాహము లేమి, అధిక దాహం, మలమూత్రాలు, ఇతర స్రావాల దుర్వాసన, అధిక ఆకలి, ఆకలి లేమి, అధిక నిద్ర, మగత, నిద్రలేమి భయంకర కలలు, ఇవి అన్నీ అనారోగ్యానికి సంకేతాలే.

వైద్య విధానాలు - చికిత్స విధానాలు

వైద్య విధానాలు 1) అలోపతి 2) హోమియోపతి 3) ఆయుర్వేదం 4) ఆక్యుప్రజర్ 5) ఆక్యుపంక్చర్ 6) ప్రాణచికిత్స ఇంకా కొన్ని విధానాలు.

అలోపతి, ఏంటిబయోటిక్, పేన్ కిల్లర్ మీద ఆధారపడి వైద్యము ఉంటుంది. వ్యతిరేక లక్షణ ఔషధ ప్రయోగం ఈ విధానం. తరువాత కాలంలో దుష్ప్రభావం చూపడం అందరికి అనుభవమే.

ప్రపంచ ఆరోగ్యసంస్థ మిక్కిలి అలోపతి ఔషధాలను ప్రజలు విరివిగా వాడిన తరువాత వాటి దుష్ప్రభావములు తెలిసివచ్చి నిషేధించినవి కోకొల్లలు. ఇంత పెద్ద జాబితా ఏ వైద్య విధానములోను లేవు. ఇదే దానికి పెద్ద గీటురాయి. ఈ ప్రయోగాలన్నీ జంతువులమీద చేసినవి కనుక. వాటికి ఔషధము వాడిన తరువాత, వచ్చు మార్పులు అనగా, ఆందోళన, మంట, మొదలగు లక్షణములు వెలిబుచ్చ లేవు. హోమియోలో ఇట్లుగాక ఆరోగ్యమైన మానవులమీదే ప్రయోగించి వాటి లక్షణములు తెలిసికొనుటవలన ఇందులో నిషేధాని గురియైన ఒక్క మందులేదు.

హోమియోపతి వేదనా సముదాయమునకు సరిపడా ఔషధము అనగా సరూప్యము అనగా రోగి వేదనలు ఔషధములోని వేదనలు సమానముగా ఉండి పొటన్సీలో (అనగా పరమాణులుగా శక్తిగా మార్చినది) ఈ వైద్యములో దుష్ప్రభావము లేకుండా సంపూర్ణ నివారణ కలుగుచున్నది.

ఆయుర్వేదము భారతీయ సాంప్రదాయ వైద్యం వాత, పిత్త, కఫాల మీద ఈ వైద్యం జరుగుతుంది. ఇందులో మసాజులు, పంచకర్మ ప్రాముఖ్యములు.

**ఆక్యుపంచర్** : చైనా సాంప్రదాయ వైద్యం. నాడులుకు సూదులు గుచ్చి (కొన్ని కేంద్రాలలో) నాడులు ఉత్తేజపర్చి రోగనివారణ పద్ధతి.

**ఆక్యుప్రజర్** : వ్యాధిని బట్టి నాడి యొక్క కేంద్రాలు తెలుసుకుని స్వయంగా ఎవరైనా చికిత్స చేసుకొనవచ్చు.

ఇంతవరకు వివిధ వైద్య విధానాలు తెలుసుకున్నాం. ఇప్పుడు ఉత్తమమైన చికిత్స విధానాన్ని మీ ముందు ఉంచుతున్నాం.

వైద్యం అన్నది అటు మానసికంగాను, ఇటు శారీరకంగా జరగాలి. మానసిక ఆందోళన,, భయము, నిర్మూలన జరిగి దాని స్థానంలో మానసిక ప్రశాంతత, భయములేని, ఆత్మస్థైర్యము నెలకొల్పబడాలి. దీనికి కావలసిందల్లా నేను మానసిక శారీరక ఆరోగ్యంగా ఉండాలనే పట్టుదల, ప్రగాఢ కాంక్ష కావాలి. దానికి కావలసింది కొద్ది సమయం సాధనకు కేటాయించడమే వైద్యుడు ఔషధం అవసరంలేని మానసిక, శారీరక ఆరోగ్యం కోసం.

**జీవశక్తి, ఆరోగ్యం, అనారోగ్యం దీనికి గురించి కొద్దిగా తెలుసుకుందాం :**

ఆరోగ్యంగా ఉండడానికి ఎల్లప్పుడూ సహకరించేది ప్రాణశక్తి.

ఆరోగ్యం కలతచెందితే అనారోగ్యం ఏర్పడుతుంది. ఈ అనారోగ్యాన్ని నిర్మూలించుటకు మనలో ఉన్న ప్రాణశక్తి పోరాడుతుంది. ఈ సంఘర్షణలో ఏర్పడేవే మనలో వేదనలు. ఉదా॥ నొప్పి, సలువు, వాపు, మంట మొ॥ వీటిని మనం వేగులు, లేక వార్తా హరులు అనవచ్చును. అలోపతిలో ఈ వార్తాహరులను, నొప్పి నివారణ (పేన్ కిల్లర్ ఏంటిబైటిక్) తో నిర్మూలించటం జరుగుతుంది. ఇక మనకి మన అనారోగ్యం గురించి (శత్రువు గురుంచి) సమాచారాన్ని అందించే వ్యవస్థ నాశనం అవుతుంది. మనకు శత్రువు అనబడే వ్యాధి అతి సులువుగా లొంగతీసుకోవడం జరుగుతుంది. వేదనలు భగవంతుడు ఇచ్చిన వరం ఇవే లేకపోతే లోపల ప్రమాదాన్ని పసిగట్టలేం. తగిన జాగ్రత్త తీసుకోలేం. వాటిని పేన్ కిల్లరుతో, ఏంటిబయోటిక్‌తో అధిక ధనము వ్యర్థముచేసి ఈ వ్యవస్థను పాడుచేసి, ప్రమాదాన్ని కొని తెచ్చుకొంటున్నాము.

హోమియోపతి శాస్త్రము కూడా వ్యాధికి మందులేదు అనే చెబుతుంది. ట్రీట్ ది పేషంట్, నాట్ ది డిసిజ్ హోమియోపతి మందు ప్రాణశక్తికే అదనపు శక్తిని చేకూర్చి వ్యాధిపై పోరాటానికి సన్నద్ధం చేసి సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చుతుంది.

ఒక్క ప్రాణశక్తికి మాత్రమే రోగశక్తిని బహిర్గతము చేయుశక్తి ఉన్నది గాని ఏమందుకూ లేదు. ఈ ప్రాణశక్తే ఆరోగ్యం కాపాడడానికి, పరిస్థితి మారితే అనారోగ్యము వృద్ధి చెందడానికి ఉపయోగపడుతుంది. కావున మనకు తెలియవలసినది ప్రాణశక్తి యొక్క శక్తి. ప్రకృతిపరంగా దానిని అధికముగా లోనికి స్వీకరించడం వ్యాధులకు, వైద్యునకు, ఔషధాలకు, దూరంగా ఉండే ఉత్తేజకరమైన శారీరక, మానసిక శక్తిని పొందడం కేవలం ఒక్క మీ సాధన వలన మాత్రమే సాధ్యం. అంటే స్థూలంగా ప్రతీ వ్యక్తి ఆరోగ్యం వానిచేతిలోనే ఉంది. ప్రకృతిపరంగా ప్రాణశక్తిని పొందడమే ప్రాణాయామ సాధన.

**ప్రాణాయామ సాధన - లాభాలు - చేసే విధానం :**

**లైఫ్ స్పేన్ పెరుగుట** : ప్రాణాయామ సాధన వలన జీవితకాలం ఎక్కువ అవుతుంది. ఉదా॥ కుక్క 14 సం॥రం, గుర్రం 40 సం॥రం, మనిషి 100 సం॥రం, త్రాచుపాము 300 సం॥రం, తాబేలు 800 సం॥రం బ్రతుకుతాయి ఈ వ్యత్యాసము వాటి వాటి శ్వాసక్రియవలన కుక్క కంటె గుర్రం, గుర్రంకంటె

(మిగతాది 4వ పేజిలో)

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.

Date of posting 17 & 20 every month
Date of publication 15-9-2015
**RNI Regd. No. APBIL/2012/50668**
**Postal Regn. No. HSE/677/2015-2017**



## تحفظ کی سیاست اور گجرات میں پٹیل سماج کی جدوجہد -۲

بہار میں انتخابات کا الان ہو چکا ہے ۔ سب سیاسی دل عوام کے سامنے اپنا اپنا نظریہ رکھ رہے ہیں ۔ چناوی لڑای دو گٹھ بندنوں کے بیچ کی ہے ۔ انمے سے کوئی بھی عوام کو یہ نہی بتا رہا ہے کہ سطا میں آنے کے بعد کون کون سے طریقے اپناتے ہوئے یہ عوام میں فیلی ہی مفلسی اور بیروزگاری کو دور کرینگے ۔ جو اس چناوی جنگ میں عوام کی ترقی کی بات کر رہے ہیں وہ یہ نہی بتا رہے کہ ایسا کون سا نیا نظام وزود میں لایا جاےگا جسسے عوام میں فیلی بدحالی نیست نابود ہو جاےگی ۔ دیگر سیاسی دل تو جاتی اور مذہب کے نام پر جنتا سے ووٹ مانگ رہے ہیں ۔ کول ملا کر اب تحفظ ہی بحس کا گزار بن کر رہ گیا ہے ۔ ایک اور تحفظ کے نظام کو بند کرنے کے الزامات لگاے جا رہے ہیں ، دوسری اور اس الزام کو نکارا جا رہا ہے ۔ سوال یہ ہے کہ تحفظ کے بندوبست کے علاوہ عوام کی ترقی کا اور کوئی راستہ نہیں ہے کیا ؟ اسکا جواب ڈونڈنے سے پہلے ایک نظر اس حقیقت پے ڈالیں کہ تحفظ کے بندوبست سے حاصل کیا ہوا ہے ۔

کیا بیروزگاری کا مسلہ حل ہوا ہے ؟ لاکھوں کی تعداد میں جو لوگ اس بندوبست کا فایدہ اٹھاتے ہوئے انگریزی سکولوں اور کالجوں میں علم حاصل کئے ہیں ان سب کو تو روزگار حاصل نہیں ہوتا ؛ جو انجنیئر ، ڈاکٹر ، وکیل ، یا پھر دیگر پیشوار تعلیم حاصل کرکے بننے ہیں انمے سے جیاداتر تو بیروزگاری سے پریشان ہیں ؛ اسکے کم سے کم دو وجاہات ہیں : ۱) انھ اس کدر تعلیم حاصل نہ ہوئی ہے جو انھ ان پیشوں کے کابل بنا سکے اور ایسوں کی تعداد بہت بھاری بھرکم ہے اور یہ تعلیمی اداروں پے بہت بڑا سوال کھڈا کرتا ہے ، ۲ ) یہ کہ اتنی نوکریاں ہی نہی جو انمے کابل کو روزگار دلا سکے ۔ ہزار دوہزار کی نوکریوں کو یہ ترس جاتے ہیں ۔ ان باضابطہ تعلیم یافتہ لوگوں میں ایسا کوئی ہنر یا کابلیت نہی جسسے یہ روزگار کا کوئی خود کا راستہ نکال پایین ۔ ایسی سرعام فیلی بیروزگاری کے باوزود والدین تحفظ کا فایدہ لیتے ہوئے اپنے اپنے بچوں کو ایسی تعلیمی اداروں میں بھیجتے ہیں اور انکی زندگی کی بربادی کا نسکا لکھ دیتے ہیں. علم یافتہ نوجوان جب بیروزگاری کو برداشت نہی کر پاتا تو جرم کا راستہ اختیار کر لیتا ہے ، جرم چھوٹا ہو یا سنگین ۔ یہ حقیقت ہر سیاستدان کو معلوم ہے ؛ ہر سیاست دل کو اور انکے نیتاؤں کو معلوم ہے لیکن پھر بھی اپنا اپنا ووٹ دروست کرنے مافک عوام کو تحفظ کے نام پر گمراہ کرتے ہیں ۔ کیونکہ ایسا کرنے سے صرف اور صرف انکا ہی فایدہ ہوتا ہے ۔ کوئی بھی ایسا معاشرہ جو بیروزگار نوجوانوں سے بھرا پڑا ہو جرم کی پیدائش کے لئے ایک زرخیز زمین کی ترہ ہوتا ہے ۔ یہ سیاستدان ایسے نوجوانوں کا استمال دنگے فساد اور کتل عام کروانے کے لئے کرتے ہیں اور خود محفوظ رہتے ہیں کیونکی پولیس ، کچہری ، منصف ، آرمی سب انکے اختیار میں رہتے ہیں؛ سماج کو تقسیم کرنے کی سیاست کرنے والے ان سوداگروں کو بیروزگاری اور مفلسی کے حالات بہت عزیز ہیں ۔ ایسی غیر انسانی سیاست جسمے عوام کا استحصال مکمل ہو، اسکا مخالفت کرنے مے ہی ہندوستانی سماج کی بھلایی ہے ۔ کیونکی اگر یہ سیاستدان ہر جاتی اور مذہب کے لوگوں کو تحفظ میں شرکت دے ، ایسا کرنے سے بھی بیروزگاری اور بدحالی کا ماحول بدلنے والا نہی ہے کیونکہ دنیا بھر میں ایسا کوئی ملک نہی جسے ہر سالوں سال لگاتار ہزاروں کی تعداد میں ڈاکٹر ، انجنیئر ، وکیل اور دیگر پشواروں کی ضرورت ہو ۔ اسلئے یہ ضروری ہے کہ یہ جھوٹھا خواب جو

۷۰ سالوں سے سیاستدان عوام کے روبرو روشن کرتے آرہے ہیں اسے ٹھکرایا جائے اور ایک ایسے نظام کی مانگ کی جائے جو جاتی مذہب اور لنگ کے بھید بھاوون سے اپر اٹھکر سب کو علم اور روزگار موحیہ کرانے مے مہارت رکھتا ہو ۔ کیا ایسا ہونا ممکن ہے ؟

بلکل ممکن ہے اگر ہمارے سیاستدان خدگرجی چھوڈ عوام کو صرف اپنا اپنا ووٹبنک نہ مانے اور انکی خوشحالی کے بارے میں سوچے تو راستے بھی نکل آیینگے ۔ لیکن اسکیلئے سبسے پہلے یہ سمجھنا ہوگا کہ ہماری آبادی کا ۸۰ سے ۸۵ فیصد کس کابل ہے اور وہ کس کس طرح کے ہنرمند ہیں ۔ سیاستدانو کو یہ سوچنا ہوگا کہ کیا علم صرف سکولوں میں ملتی ہے یا پھر یہ کیی اور طریقوں سے بھی حاصل ہو سکتی ہے؛ یہ سوچنا ہوگا کہ بنا سکول گیے ایسے لاکھوں لوگ جو اپنا اپنا روزگار چھوٹے چھوٹے وپاپار کرکے کماتے ہیں وہ کس علم کی وجہ سے ایسا کر پتے ہیں جیسے کہ فٹکر دندہ کرنے والے ؛ کاریگر لوگ جیسے کہ لوہار ، ترکھان ، کمہار ، بنکر اور دیگر پیشوار کہاں سے علم حاصل کرکے ایسا کر پاتے ہیں کہ انھ روزگار کے لئے نوکریوں کی تلاش نہی رہتی ۔ یہ کیسے علم یافتہ نوجوان ہیں جو اپنے اپنے ہنر سے خود کے روزگار کے راستے ڈونڈ نکلتے ہیں ؟ ایک ام بی ے کی ڈگری لیا ہوا علم یافتہ کو نوکری کی تلاش رہتی ہے کیونکی وہ خود کچھ بھی کرنے کی کابلیت نہی رکھتا وہیں ایک بے علم (سکولوں میں تعلیم نہ لیا ہوا ) کسی نہ کسی طریقے سے روزگار کا زریا نکال لیتا ہے — اپنے اپنے ہنر کے متابیک ۔

ہندوستان میں جتنا بھی وپاپر ہوتا ہے اسکا لگبگ ٦٠ فیصد حصّہ ایسے لوگ کرتے ہیں جو سکولوں میں پڈایی لکھایی کر کے نہی آتے ۔ اسکا مطلب یہ ہوا کہ زندگی خود کے بھروسے زینے کا علم صرف سکولوں اور کالجوں مے نہی ملتا وہ کہیں نہ کہیں سماج میں نہت ہوتا ہے جسسے بچے علم کے طور پر سیکھتے ہیں اور ایک خوددار زندگی جینے کی کوشش کرتے ہیں ۔ یہ ہمارے سماج کا ایسا تپکا ہے جو زندگی بھر اپنے سماج سے جڑا رہتا ہے اور اس دیش کی ترقی میں اپنا یوگدھان کرتا ہے؛ لیکن ایسے تپکے کو ہی ہمارے سیاستدانو اور نیتاؤں نے خود کے گرز کے لئے پچھڈا ورگ گھوشیت کر دیا ہے ۔ ایک سماج کے ہنرمند باشندو کو بے علم اور پچھڈا کرار دینا کیونکی آپ انگریزوں کی سوچ انپے تھوپنا چاہتے ہیں اسسے بڈکر نہ انصافی کیا ہو سکتی ہے. جو میک ان انڈیا کی بات کرتے ہیں انسے کوئی یہ تو کہے کہ میک ان انڈیا صدیوں سے ہندوستان میں چلا آرہا ہے ، تب سے جب انگریزوں کو زمین کے گول اکار ہونے پر آپسی وروده تھا اور چکور اکار کی سمجھ بناے ہوئے تھے ۔ کسان کو کسانی آج کے سائنسدانو نہی سکھایی وہ تو یوگوں سے کسانی جانتا ہے ؛ بنکر بھی بننے کا ہنر صدیوں سے جانتا ہے جیسے آدیواسی جنگلوں کا ویگیاں جانتا ہے ؛ عورت پریوار اور سماج کو چلانے اور ویوستیت کا گیاں صدیوں سے رکھتی ہے ؛ وپاپار کرنا ، اسپت اور لوہا بنانا ، برتن اور شستر بنانے کا گیاں اور ویگیاں ہم صدیوں سے جانتے ہیں ، یہ سب ہمے انگریزوں نے نہی سکھایا — انہونے اور ہمارے نیتاؤں نے اس ہنر ، گیاں ، ویگیاں کا استحصال کیا ہے اور ناکارہ ہونے کا فرمان زاری کیا ہے ۔ جس ورگ کو پچھڈا کہا گیا ہے یہ استحصال کی سیاست ہے ؛ لوگوں کو آپس میں بانٹنے کی سیاست ہے ۔ ضروری یہ ہے کہ انکے گیاں اور ہنر کو سمجھنے کی کوشش کی جائے اور پھر اسکا استمال کرتے ہوئے انکی خوشحالی کے راستے نکالے جائے ۔

మనిషి, మనిషికంటే త్రాచు, త్రాచుపాముకంటే తాబేలు, శ్వాసలు తక్కువగా తీసుకొనుట దీనికి కారణం. కుక్క గుర్రములాగ శ్వాసను సాధన చేయలేదు. ఒక్క మనిషి మాత్రమే సాధన ద్వారా త్రాచుపాము, తాబేలు లాగా శ్వాస సాధనచేసి జీవితకాలాన్ని పొడిగించు కోగలడు. ఇప్పటికీ హిమాలయాల్లో ఋషులు వందల ఏళ్ళు దాటినవారున్నారని ప్రతీతి. మనిషి జీవితకాల శ్వాసలు 64 వేల కోట్ల పై చిలుకు. ఇవి మన ఎ.టి.యం.లో ఉన్నవి. ఆందోళన, పగ, భయము లాంటి మానసిక లక్షణాలతో శ్వాసలు అధిక ఖర్చును తగ్గించుతుంది ప్రాణాయామ సాధన.

**శక్తి - వ్యయము** : ఎడతెగని ఆలోచనా పరంపరవలన శారీరక శ్రమకంటే అధికముగా శక్తి వ్యయము అవుతుంది ఉదా॥ మనకు అలసటగా ఉన్నా ఎంత ఖరీదైన ఆహారము తీసుకున్నా శక్తి తక్షణం చేకూరదు. కొద్ది సమయము నిద్రపోయిన శక్తి వచ్చుట అందరికి అనుభవమే. నిద్రలో మనస్సు ఆలోచనలు ఆగిపోవుటవలన శక్తి చేకూరుతుంది. నిద్రలో కాకుండా మెలుకువగా ఉన్నప్పుడు ఆలోచనలను నియంత్రణ చేయు విధానం ప్రాణాయామ సాధన వలన చేకూరుతుంది. అందువలన అలసటకు దూరంగా దినచర్య ఉంటుంది.

**విద్యార్థులకు** : ఏకాగ్రత, అభివృద్ధి, జ్ఞాపకశక్తి పెరిగి పరీక్షలంటే భయము తగ్గి విశ్వాసము పెరుగును.

**నాడీ శుద్ధి** : మనలోనున్న 74వేల నాడులను శుద్ధి చేసి, ఉత్తేజ పరుచుతుంది.

**లాభాలు** : వ్యతిరేక ఆలోచనల నుండి సానుకూల ఆలోచనలకు, ఆందోళన నుండి ప్రశాంతత వైపు, కంగారు నుండి నిదానం వైపు భయం నుండి ధైర్యం వైపు. నూన్యత నుండి చైతన్యం వైపు, నిరుత్సాహము నుండి ఉత్సాహము వైపు, ఆత్మహత్యా తలంపు నుండి జీవించాలనే ఇచ్ఛ వైపు, అసంతృప్తి నుండి తృప్తి వైపు కోపం నుండి శాంతం వైపు ఇంకా చాలా. మధుమేహము, అధికరక్తపోటు మొ॥ అనేక వ్యాధులు వైద్యుడు, ఔషధము లేకుండానే సంపూర్ణ ఆరోగ్యం కేవలం ప్రాణాయామం వలన మాత్రమే లభిస్తుంది.

ముద్ర : ముద్ర ప్రయోజనం తెలుసుకొనే ముందు ఇంటి కరెంటు గురించి మనము వాడే గృహోపకరణాల గురించి తెలుసుకోవాలి. టి.వి., ఫ్రిజ్, మిక్సీ, గైండర్‌కు సరిపడా విద్యుత్ కావాలి. (ఎక్కువ వోల్టేజి, తక్కువ వోల్టేజి) వలన పరికరాలు పాడవుతాయి. అలాగే మన అవయవాలకు ప్రాణశక్తి సరియైన పంపకము లేకపోతే మన అవయవములు పాడవుతాయి. అదే అనారోగ్యము. ముద్రలు ప్రాణశక్తిని పంపకం (డిస్ట్రిబ్యూషన్) చేస్తుంది. ఆరోగ్యానికి సహకరిస్తుంది.

చక్రములు : మూలాధార, స్వాధిష్టాన, మణిపూర, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రారము, చక్రములు ప్రాణాయాయు వలన ఈ చక్రములు, ఈ చక్రములకు సమీప గ్రంథులు (గ్లాండ్సు) ఉత్తేజమై గ్రంథులకు సంబంధించిన అవయవములు అనగా కిడ్నీ, లివర్, జీర్ణకోశము, గుండె మొ॥ అవయవములు సక్రమముగా పనిచేయును.

**సాధన - సాధన - సాధన - కొద్ది సమయం కేటాయించండి.**

**మీలో మీరు ఉండం** : ప్రముఖ మానసిక పరిశోధకుడు ఫ్రాయిడ్ చెప్పినట్లు మనం 1) అన్ కాంక్షస్ 2) సబ్ కాంక్షస్ 3) కాంక్షస్‌లో ఉంటాం. ఎక్కువగా అధిక ఆలోచనల వలన మనలో మనం ఉండము. సాధన మనలో మనం ఉండం నేర్పుతుంది. ప్రతీది గమనంలోకి వస్తుంది. ప్రకృతి, ఆహారము, మానవ సంబంధాలు అన్నింటినీ ఆస్వాదించే మానసిక స్థితి చేకూరుతుంది. వృత్తిలో నైపుణ్యము పెరుగుతుంది. సరియైన సమయానికి సరియైన ఆలోచన (ఎప్రొపరెట్ రియాక్షన్సు), ఉద్రేకము,అతిగా స్పందించడం, ఇవి అన్ని సర్దుబాటు అవుతూ వస్తాయి సాధన వలన.

చేసే విధానం (అనుభవము ఉన్న వారివద్ద శిక్షణ మంచిది)

అపానాన్ని మూలాధార చక్రమునుండి సహస్రారము వరకు లాగాలి. కేవలం 15 ని॥ తో ప్రారంభించండి. మీరు ఉద్యోగులైన ఉదయము, సాయంత్రము, మీరు విశ్రాంతి ఉద్యోగులైన రోజుకు 3 సార్లుతో ప్రారంభించండి. క్రమేపి సమయాన్ని పెంచండి. వయో, లింగ బేధము లేదు.

**- చాగంటి సుబ్రహ్మణ్యం,** ఫోన్ : 9491837903

### తక్షణ సహాయం కొరకు ప్రకటన :

**లోకవిద్య ప్రపంచం 2012, జనవరి నుండి క్రమం తప్పకుండా ప్రతినెల ప్రచురిస్తున్నాం. పత్రిక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. కావున చందాదారులు, అభిమానులు పత్రికకు తక్షణం ఆర్థిక సహాయం అందచేసి, సహకరించాలని విజ్ఞప్తి.**

**A/c No. SBH. 62222079499,** గడ్డిఅన్నారం బ్రాంచి, హైదరాబాద్. -ఎడిటర్ లోకవిద్య ప్రపంచం
**(Branch Code : 21364)**

**మీకు తెలుసా?**

**వైద్యుల నీతి నియమ నిబంధన నెం. 1.5 ప్రకారం మరియు 3/8/2015 కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ నిబంధనల ప్రకారం వైద్యులు సంబంధిత కంపెనీ, బ్రాండు పేర్లను తెలియపరచకుండా మందుపేరు మాత్రమే వ్రాయాలి, కాని వైద్యులు బ్రాండు పేరును వ్రాయటం మూలాన మందు ఖర్చులో 25% వరకు బహుమతులుగా కార్లు, ఏ.సి.లు, ఫ్రిజ్‌లు మొ॥ రూపంలో పుచ్చుకోడానికే రాస్తారని మీకు తెలుసా! బ్రాండు పేరుతో కొన్న మందులలో మనం చెల్లించే డబ్బులో 25% మార్కెటింగ్‌కి, 13% పరిశోధనకు, 20% కంపెనీ లాభాలకు చెల్లిస్తున్నామని తెలుసా!**

**- తటవర్తి నారాయణరావు**

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
**వెబ్ పేజీ** : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

వ్యాసాలు, ఉద్యమ వార్తలు కాపీల కోసం పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. Telangana- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**BOOK - POST PRINTED MATTER**
**15 DECEMBER - 2015**

**To**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. - 60**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. Telangana-500 060.**